# 2,545 మెగావాట్ల విద్యుత్ కొనుగోలు

## యూనిట్‌కు రూ.2.45 వ్యయం

## తెలంగాణ డిస్కంల ప్రతిపాదనకు ఇఆర్సీ ఆమోదం

## భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా విద్యుత్ ఏర్పాట్లు

**హైదరాబాద్, డిసెంబరు 2, ప్రభాతవార్త :** తెలంగాణలో రానున్న విద్యుత్ డిమాండ్‌ను అధిక మించేందుకు సోలార్ పవర్‌ను కొనుగోలు చేయాలని పంపిణీ సంస్థలు (డిస్కంలు) నిర్ణయించాయి. ఇందుకు గాను 2545 మెగావాట్ల సోలార్ పవర్‌ను కొనుగోలు చేయనుంది. ఇటీవల నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్, నేషనల్ హైడ్రో ఎలక్ట్రిక్ పవర్ కార్పొరేషన్, సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా నుండి ట్రేడింగ్ మార్జిన్‌తో సహా యూనిట్‌కు 2.45 రూపాయల చొప్పున దీన్ని కొనుగోలు చేయనున్నాయి. దీనికి సంబంధించి తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థలు చేసి ప్రతిపాదనకు విద్యుత్ నియంత్రణ కమిషన్ (ఈఆర్సీ) తన ఆమోదాన్ని తెలిపింది. ప్రస్తుత ఏర్పాటు ప్రకారం 2023-24 ఆర్థిక సంవత్సరంలో 404 మిలియన్ యూనిట్ల లోటుతో ప్రారంభించి 2030-31 నాటికి ఇంధన లోటు 12400 మిలియన్ యూనిట్లకు చేరుతుందని తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థలైన ఎస్పీడీసీఎల్, ఎన్పీడీసీఎల్ తెలంగాణ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ కమిషన్ (టీఎస్ఈఆర్సీ)కి ఇటీవల సమర్పించాయి విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు మరియు బహిరంగ మార్కెట్‌లో కొనుగోళ్ల ద్వారా సేకరిస్తాయి.

ఇదే సమయంలో నాణ్యమైన విద్యుత్‌ను నిర్ధారించడానికి గణనీయమైన టై అప్ ఇన్‌స్టాల్ సామర్థ్యాన్ని కలిగి ఉంటాయని విద్యుత్ శాఖ అధికారవర్గాలు వెల్లడిస్తున్నాయి. 2030-31 ఆర్థిక సంవత్సరం నాటికి తెలంగాణలో 5 శాతం నుండి 6 శాతం వరకూ విద్యుత్ డిమాండ్ పెరుగుతుందని అంచనా. ఇక పీక్ సమయంలో గరిష్టంగా 8 శాతం నుండి 9 శాతం వరకూ పెరిగే అవకాశాలు ఉన్నాయని లెక్కకట్టాయి.

ఇందుకు అనుగుణంగా రాష్ట్రంలోని అన్ని వర్గాల వినియోగదారులకు నిరంతరాయంగా విద్యుత్‌ను సరఫరా చేసేందుకు ఈ రెండు విద్యుత్ పంపిణీ సంస్థలు వివిధ ఉత్పాదక వనరుల నుండి అవసరమైన విద్యుత్‌ను పొందేందుకు పలు ప్రయత్నాలు చేస్తున్నాయి. ఇందులో భాగంగానే 2545 మెగావాట్లలో 1045 మెగావాట్లు నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ (ఎన్టీపీసీ) నుండి, 500 మెగావాట్లు నేషనల్ హైడ్రో ఎలక్ట్రిక్ పవర్ కార్పొరేషన్ (ఎన్‌హెచ్‌పిసి) నుండి, సెంట్రల్ పబ్లిక్ సెక్టార్ అండర్‌టేకింగ్ (సిపిఎస్‌యు) స్కీమ్ ఫేజ్ 2 కింద మరో 1000 మెగావాట్లను కొనుగోలు చేయనున్నాయ. ఈ రెండు విద్యుత్ పంపిణీ సంస్థలు ఇప్పటికే ఎన్టీపీసీ, సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఇసిఐ) నుండి సౌర విద్యుత్ సేకరణ కోసం ఒప్పందాలను చేసుకున్నాయి. ప్రస్తుతం ఎన్‌హెచ్‌పిసి విషయంలో ఈ ఒప్పందాల ప్రక్రియ పురోగతిలో ఉన్నట్లు విద్యుత్ శాఖ అధికారవర్గాలు వెల్లడించాయి. మరోపక్క రాజస్థాన్, గుజరాత్‌లోని నాలుగు యూనిట్ల నుండి 1045 మెగావాట్ల ఎన్టీపీసీ విద్యుత్ కోసం షెడ్యూల్ చేయబడిన వాణిజ్య ఆపరేషన్ తేదీ (ఎస్‌సిఒడి) వచ్చే ఏడాది అంటే 2023 నవంబరు, 2024 ఏప్రిల్ వరకూ ఉంటాయి. అదే విధంగా 1000 మెగావాట్లు ఎస్ఇసిఐ పవర్ కోసం రాజస్థాన్, గుజరాత్‌లోని నాలుగు యూనిట్ల నుండి 2023 అక్టోబరు నెల వరకూ అందుబాటులో ఉంటాయి.

కాగా ఇటీవల ఈఆర్సీ ఆమోదించిన 2545 మెగావాట్ల సామర్థ్యంతో సహా విద్యుత్ కొనుగోలు ఒప్పందాలతో మొత్తం తెలంగాణలో మొత్తం 8411 మెగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యం అందుబాటులో ఉంది. ఇందులో విద్యుత్ సంస్థలు ఇప్పటికే 4167 మెగావాట్ల విద్యుత్‌ను వినియోగిస్తున్నాయి. మరోపక్క 27 మెగావాట్ల సామర్థ్యానికి సంబంధించిన విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు ఈ సంవత్సరాంతానికి ముగియబోతున్నాయి. మిగిలిన 4244 మెగావాట్లు 2023 జనవరి, 2024 ఏప్రిల్ మధ్య అందుబాటులోకి వస్తాయని విద్యుత్ శాఖలోని ఒక సీనియర్ అధికారి వెల్లడించారు.

# నేను సింహయాజీని కలవలేదు

## కాంగ్రెస్ నేత దామోదర రాజనర్సింహ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబరు 2:** తాను సింహయాజిని కలవలేదని కాంగ్రెస్ నేత దామోదర రాజనర్సింహ స్పష్టం చేశారు. అసలు ఆయనెలా కూడా తనకు తెలియదని తేల్చి చెప్పారు. ఎవరో కావాలని ప్రచారం చేశారన్న ఆయన... కుట్రలు కొత్త కాదు. గతంలో చాలా సార్లు తనపై ఇలాగే కుట్ర చేశారని ఆరోపించారు. ఇక ఫామ్‌హౌస్ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న సింహయాజీతో ఉన్న సంబంధాలపై టీజేఎస్ అధ్యక్షుడు కోదండరామ్ సైతం క్లారిటీ ఇచ్చారు. ఆరు నెలల కిందట తాను సింహయాజిని కలిసింది వాస్తవమేనన్నారు. ఆయనను కలవడంలో ఎలాంటి రాజకీయ కోణం లేదని వివరించారు. తిరుపతి నుంచి వచ్చిన గురువుగా సింహయాజీని పరిచయం చేశారని చెప్పారు. ఆధ్యాత్మిక గురువుగానే సింహయాజీని కలిశానని కోదండరామ్ స్పష్టం చేశారు.



# బిజెపి జాతీయ కమిటీలో పంజాబ్ మాజీ సిఎం కెప్టెన్ అమరీందర్‌సింగ్

**న్యూఢిల్లీ, డిసెంబరు 2:** పంజాబ్ మాజీ ముఖ్యమంత్రి కెప్టెన్ అమరీందం సింగ్, మాజీ కాంగ్రెస్ నేత పిసిసిచీఫ్ సునీల్‌జాఖర్‌లను బిజెపి జాతీయ కమిటీసభ్యులుగా నియమించింది. జాతీయ కార్యవర్గంలో వీరితోపాటు ఉత్తరప్రదేశ్ మాజీ అధ్యక్షుడు స్వతంత్ర దేవ్‌సింగ్‌లను కూడా నియమించినట్లు పార్టీ హైకమాండ్‌ప్రకటించింది. కాంగ్రెస్ మాజీ అధికార ప్రతినిధి జైవీర్ షెర్గిల్‌ను తమ జాతీయ ప్రతినిధిగా నియమించింది. అలాగే ఉత్తరాఖండ్, ఛత్తీస్‌గఢ్ మాజీ అధ్యక్షులు మదన్ కౌశిక్, విష్ణుదేవ్ సాయిలతోపాటు రాణా గుర్మిత్‌సింగ్‌సోధి, మనోరంజన్ కాలియా, అమన్ జోత్‌కౌర్ రామూవాలియాలను జాతీయ కార్యవర్గంలో ప్రత్యేక ఆహ్వానితులుగా నియమించింది. వీరు ముగ్గురూ కూడా పంజాబ్‌రాష్ట్రంనుంచి వచ్చినవారే కావడం గమనార్హం.

# మాజీ ముఖ్యమంత్రి మర్రి చెన్నారెడ్డికి కాంగ్రెస్ నేతల నివాళులు

**హైదరాబాద్, డిసెంబరు 2, ప్రభాతవార్త:** మాజీ ముఖ్యమంత్రి మర్రి చెన్నారెడ్డి వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ నేతలు నివాళులు అర్పించారు. శుక్రవారం గాంధీభవన్‌లో ఆయన చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య, టిపిసిసి వర్కింగ్ ప్రసిడెంట్ అంజన్‌కుమార్ యాదవ్, నిరంజన్, కుమార్‌రావు, కోట్లశ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

# నాపై ఉన్న ఇడి కేసు కొట్టివేయండి

## హైకోర్టులో ఎంపి నామా నాగేశ్వరరావు పిటిషన్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబరు 2:** తనపై ఉన్న ఈడీ కేసు కొట్టివేయాలని టిఆర్ఎస్ ఎంపీ నామ నాగేశ్వరరావు హైకోర్టులో పిటీషన్ వేశారు. ఆస్తుల అటాచ్ ఉత్తర్వులను కొట్టివేయాలని కోరారు. రాంచీ ఎక్స్‌ప్రెస్ హైవే కేసుతో తనకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. 2009లోనే మధుకాన్ గ్రూప్ కంపెనీలకు రాజీనామా చేసినట్లు తెలిపారు. సిబిఐ ఎఫ్ఐఆర్, చార్జ్‌షీట్‌లోనూ తన పేరు లేదని పిటీషన్‌లో పేర్కొన్నారు. కౌంటరు దాఖలు చేయాలని ఈడీకి హైకోర్టు ఆదేశించింది. అనంతరం విచారణ ఈనెల 9కి వాయిదా వేసింది. రాంచీ ఎక్స్‌ప్రెస్ హైవే పేరిట టిఆర్ఎస్ ఎంపీ నామా నాగేశ్వరరావు రుణాలు తీసుకొని దారి మళ్లించారని ఈడీ ఆరోపించింది. సుమారు రూ.361.92 కోట్లు నేరుగా మళ్లించినట్లు గుర్తించామని పేర్కొంది. నామ నాగేశ్వరరావు,నామ సీతయ్య ఆధీనంలో ఆరు డొల్ల కంపెనీలు ఉన్నట్లు ఈడీ వెల్లడించింది. నామ నాగేశ్వరరావు కుటుంబానికి చెందిన రూ.80.66 కోట్లను జప్తు చేసింది. జూబ్లీహిల్స్‌లోని మధుకాన్ గ్రూప్ ప్రధాన కార్యాలయంలో పాటు హైదరాబాద్, ఖమ్మం, ప్రకాశం జిల్లాల్లోని 28 స్థిరాస్తులను అటాచ్ చేసింది. రుణాల పేరిట మోసం చేసిన కేసులో గతంలో నామకు చెందిన రూ.73.43 కోట్ల విలువైన ఆస్తులను ఈడీ అటాచ్ చేసింది.

# ఎమ్మెల్యేల ఎర కేసులో నిందితుల ఫోన్ సంభాషణ వింటే ఆశ్చర్యం వేస్తుంది!

## పిసిసి సీనియర్ ఉపాధ్యక్షుడు నిరంజన్

**హైదరాబాద్, డిసెంబరు 2, ప్రభాతవార్త:** ఎమ్మెల్యేల ఎర కేసులో నిందితుల ఫోన్ సంభాషణ వింటే ఆశ్యర్యం వేస్తుందని టిపిసిసి సీనియర్ ఉపాధ్యక్షులు నిరంజన్ అన్నారు. శుక్రవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. అధికారంలో ఉన్న పార్టీలు ఎంతటికైనా దిగజారుతారు అనడానికి ఈ కేసు నిదర్శనం అన్నారు. సిట్ విచారణలో రాష్ట్రంలో ఉన్న చాలా నాయకులు పేర్లు ఫోన్ సంభాషణలు బయటకు వచ్చాయన్నారు. కేసులో వారి ప్రమేయం లేకుండా భయపెట్టి బిజెపి పార్టీలో చేర్చుకునే కుట్ర జరుగుతుందన్నారు. తప్పుడు దారులు తొక్కి ఇతర పార్టీ నాయకులకు చేర్చుకోవడం ప్రజాస్వామ్యానికి విరుద్ధం అన్నారు. 2014 ఎన్నికల తరువాత కెసిఆర్ ఇలాంటి కార్యక్రమాలకు తోవ చూపాడని, ఇప్పుడు బిజెపి అనుసరిస్తుందన్నారు. ఇతర పార్టీలోని నేతలను కేసుల పేరులో భయపెట్టి బిజెపి చేర్చుకోవడం సరైంది కాదన్నారు. మోడి, అమిత్ షా తరువాత బిజెపిలో నప్రముఖుడైన బిఎల్ సంతోష్ పేరుతో ఫాంహౌజ్‌కేసులో వచ్చిందన్నారు. బిఎల్ సంతోష్, రామచంద్ర భారతి చర్చలు జరపారని సిట్ విచారణలో తేలిందని, సిట్ విచారణ తేలిన విషయాలపై ప్రధాని, ఆర్ఎస్ఎస్ స్పష్టత ఇవ్వాలన్నారు.

# కెజిబివి బోధనా సిబ్బందికి ఉద్యోగభద్రత కల్పించాలి

## నేడు పాఠశాల విద్య డైరెక్టర్ కార్యాలయం ముందు టిపిటిఎఫ్ ధర్నా

**హైదరాబాద్, డిసెంబరు 2, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాల్లో పనిచేస్తున్న బోధన, బోధనేతర సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలని టీపీటీఎఫ్ డిమాండ్ చేసింది. వారికి కనీస వేతనం చెల్లించాలని డిమాండ్ చేస్తూ నేడు(శనివారం) పాఠశాల విద్య డైరక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టనున్నట్లు టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు అశోక్ కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముత్యాల రవీందర్ శుక్రవారం తెలిపారు. కేజీబీవీల్లో సీఆర్‌టీలు, విద్యార్థినుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కేజీబీవీల దగ్గర మధ్యాహ్న భోజన సమయంలో నిరసనలు చేపట్టామని.. ఆ తరువాత జిల్లా కలెక్టరేట్ల ముందు నిరసన ప్రదర్శనలు, ధర్నా చేశామని తెలిపారు. అయినప్పటికీ పాఠశాల విద్య కమిషనర్ స్పందించలేదని మండిపడ్డారు. ఈ నేపథ్యంలోనే కేజీబీవీల్లో పనిచేస్తున్న బోధన, బోధనేతర సిబ్బందికి ఉద్యోగభద్రత కల్పించాలని, వారికి వారాంతపు సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వాచ్ ఉమెన్, ఇతర సిబ్బందికి ఆదివారంతోపాటు.. పండుగ సెలవులు కూడా ఇవ్వడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. కనీస వేతనం చెల్లింకపోగా.. జీతాల బిల్లులకు నెల రోజుల వర్క్‌డన్ మెమో చేర్చితే గాని చెల్లించడం లేదన్నారు. కేజీబీవీల్లో పనిచేస్తున్న బోధనాసిబ్బందికి కూడా రెగ్యులర్ ఉపాధ్యాయుల మాదిరిగా అన్ని రకాల సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేజీబీవీల్లోని అన్ని రకాల ఖాళీలను భర్తీ చేయాలని విద్యార్థినులకు పౌష్టికాహారం, ట్రంక్‌పెట్టెలు, దుప్పట్లు, ఇంటర్ చదివే వారికి యూనిఫామ్‌లు సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ నేడు(శనివారం) పాఠశాల విద్య డైరక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేయనున్నట్టు తెలిపారు.

# ధరణి పోర్టల్ దేశంలోనే పెద్ద భూకుంభకోణం

## దీనిపై కేంద్రం విచారణ జరిపించాలి

## ఢిల్లీలో కేంద్ర కార్యదర్శిని కలిసిన కాంగ్రెస్ నేతలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబరు 2:** తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణి పోర్టల్‌పై విచారణ జరిపించాలని కాంగ్రెస్ నేత వి.హనుమంతరావు, కిసాన్ కాంగ్రెస్ నేత కోదండరెడ్డి, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ధరణి పోర్టల్ తీసుకొచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో వేల ఎకరాల భూములు కబ్జాకు గురయ్యారని ఆరోపించారు. పట్టా భూములు, ఇందిరాగాంధీ పంచిన భూములను నిషేధిత జాబితాలో చేర్చి 24 లక్షల కుటుంబాల భూములను పట్టా చేయలేదన్నారు. ఇది దేశంలోనే అతిపెద్ద భూ కుంభకోణమని పేర్కొన్నారు. ఢిల్లీలో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి అజయ్ టిర్కీని కాంగ్రెస్ నాయకులు కలిసి ధరణి పోర్టల్ వ్యవహారంపై ఫిర్యాదు చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన భూ రికార్డుల సవరణ పేరుతో జరిగిన అవకతవకల విషయంలో సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా టిపిసిసి సెక్రటరీ కురువ విజయ్‌కుమార్, మరో నేత వేనారెడ్డి తదితరులు కూడా వెంట ఉన్నారు. ధరణి పోర్టల్ రికార్డును విదేశీ కంపెనీకి ఎలా ఇస్తారని ప్రశ్నించారు. నిషేధిత భూమిగా ఉన్న 600 ఎకరాలను మైహోం రామేశ్వరావుకి ఎలా కట్టబెట్టారని ప్రశ్నించారు. ఇక్కడ ఎకరాకు రూ.3 కోట్ల ధర ఉండగా, అప్పనంగా రూ.2లక్షలకే మై హోమ్ రామేశ్వరరావుకి కేటాయించారని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం భూములను వేలం వెయొద్దు. వేల కోట్ల రూపాయల కోకాపేట భూములను ఎలా వేలం వేస్తరు? అని కోదండరెడ్డి ప్రశ్నించారు. ధరణి పోర్టల్ పూర్తిగా అవకతవకలతో ఉందని దామోదర్‌రెడ్డి ఆరోపించారు. రాష్ట్రం లోని ఒక్క గుంట భూమిని కూడా పోనివ్వమంటూ ముఖ్య మంత్రి కెసిఆర్ ధరణి పోర్టల్‌ను తీసుకొచ్చారని, ఇప్పుడు నైజాం నుంచి వచ్చిన భూములు కూడా కబ్జాల బారినపడ్డాయని తెలిపారు. పేదల భూములు అక్రమంగా టిఆర్ఎస్ నాయకులు దోచుకుంటున్నారని వ్యాఖ్యానించారు. సానుకూలంగా స్పందించిన అధికారులు త్వరలోనే దీనిపై పూర్తిస్థాయిలో విచారణ జరిపిస్తామని హామి ఇచ్చారని తెలిపారు. త్వరలో నేను పాదయాత్ర చేస్తా, రేవంత్‌రెడ్డి కూడా దానికి మద్దతు ఇవ్వాలని హనుమంతరావు పేర్కొన్నారు.

# పిసిసి అధ్యక్షుడు రేవంత్‌తో మహారాష్ట్ర మాజీ సిఎం భేటీ

**హైదరాబాద్, డిసెంబరు 2, ప్రభాతవార్త:** మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి పృథ్వీరాజ్ చవాన్ టిపిసిసి అధ్యక్షులు రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసారు. హైదరాబాద్‌కు వచ్చిన ఆయన జుబ్లిహిల్స్ లోని రేవంత్‌రెడ్డి నివాసంలో కలిసారు. దాదాపు గంటలకుపైగా భేటి అయ్యారు. దేశంలో ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, భారత్ జోడో యాత్ర అంశాలపై చర్చించారు. దేశంలో ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పకొట్టా లంటే కాంగ్రెస్ అధికారంలోకి రావాలని చవాన్ అభిప్రాయపడ్డారు.



మరోవైపు తెలంగాణ, మహారాష్ట్రలో భారత్ జోడో జరిగిన తీరు ఇరు రాష్ట్రాల్లో జోడో యాత్ర ప్రభావంపై చర్చించారు. ఈ భేటిలో మాజీ ఎంపి మల్లు రవి పాల్గొన్నారు.

# వాట్సాప్ ద్వారా ఎల్ఐసి సేవలు

**హైదరాబాద్, డిసెంబరు 2, ప్రభాతవార్త :** వాట్సాప్ ద్వారా ఎల్ఐసీ సేవలను ప్రారంభించింది. ఈ మేరకు దీనికి సంబంధించి ఎల్ఐసి ఛైర్‌పర్సన్ ఎమ్మార్ కుమార్ ఈ వాట్సాప్ ప్రారంభించారు. ఎల్ఐసి పోర్టల్‌లో తమ పాలసీలను నమోదు చేసుకున్న పాలసీదారులు వాట్సాప్‌లో 8976862090 మొబైల్ నెంబరు ద్వారా హాయ్ అని పంపించితే వివిధ సేవలను ఉపయోగించుకునే వెసులుబాటును కల్పించింది. హాయ్ అని వాట్సాప్‌లో మెసేజ్ పంపితే తమ పాలసీకి సంబంధించిన 11 రకాల సేవలు అందుబాటులో ఉంటాయి. ప్రీమియం బకాయిలు, బోనస్ సమాచారం, పాలసీ స్టేటస్, రుణం అర్హత, లోన్ రీపేమెంట్, వడ్డీ బకాయి, ప్రీమియం చెల్లిస్తే దాని రశీదు, ఇతర ఎల్ఐసీ సేవలకు సంబంధించిన లింక్ తదతర సేవలను పొందే అవకాశం కలుగుతుంది.

# ఎఫ్ఎల్ఎన్ పర్యవేక్షణకు వేసిన టాస్క్‌ఫోర్స్ పేరు మార్చాలి

## కమిటీలో ఎన్‌జిఒ సభ్యులను తొలగించాలి

## విద్యా శాఖ కార్యదర్శి కరుణకు ఎమ్మెల్సీ కాటేపల్లి జనార్దన్‌రెడ్డి విజ్ఞప్తి



**హైదరాబాద్, డిసెంబరు 2, ప్రభాతవార్త:** రాష్ట్రంలో తొలిమెట్టు(ఎఫ్ఎల్ఎన్) పర్యవేక్షణ కోసం పాఠశాల విద్య శాఖలో జిల్లాస్థాయిలో ఏర్పాటు చేయనునన టాస్క్‌ఫోర్స్ పేరు మార్చాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కాటేపల్లి జనార్దన్‌రెడ్డి విద్యా శాఖ కార్యదర్శి వాకాటి కరుణకు వినతిపత్రం సమర్పించారు. అలాగే కమిటీలో ఎన్‌జీవో సభ్యులను తొలగించాలని కోరారు. పీఆర్‌టీయూ తెలంగాణ రాష్ట్ర కమిటీ అధ్వర్యంలో ఆయన శుక్రవారం విద్యా శాఖ కార్యదర్శిని కలిసి వినతిపత్రం సమర్పించారు. అంతకుముందు పీఆర్‌టీయూ తెలంగాణ రాష్ట్ర కమిటీ అధ్వర్యంలో పత్రికా విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ కాటేపల్లి జనార్ధన్‌రెడ్డితోపాటు పీఆర్‌టీయూ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎం చెన్నయ్య, ప్రధాన కార్యదర్శి మారెడ్డి అంజిరెడ్డితోపాటు సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు ముకుంద్‌రెడ్డి, గౌరవాధ్యక్షులు సత్యనారాయణ, యాదాద్రి జిల్లా అధ్యక్షులు గిరిధర్ రేపాక తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంఘం తరపున మహబూబ్‌నగర్- రంగారెడ్డి- హైదరాబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గానికి ప్రస్తుతం ఎమ్మెల్సీగా కొనసాగుతున్న కాటేపల్లి జనార్ధన్‌రెడ్డిని అభ్యర్థిగా ఏకగ్రీవంగా ఆమోదిస్తున్నట్టు సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం చెన్నయ్య ప్రకటించారు. అనంతరం ఎమ్మెల్సీ కాటేపల్లి జనార్ధన్‌రెడ్డి మాట్లాడుతూ తాను రెండు సార్లు ఎమ్మెల్సీగా గెలిచి ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న ఎన్నో సమస్యలను పరిష్కరించానని చెప్పారు. ప్రస్తుతం 317 జీవోతో సొంత జిల్లాను కోల్పోయిన వారి సమస్యలను పరిష్కరించడంతోపాటు.. 13 జిల్లాల్లోని స్పౌజ్ కేసుల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. గత రెండుసార్లు తాను చేసిన పనులను దృష్టిలో పెట్టుకొని మరోసారి అవకాశం కల్పించాలని కోరారు. తనకు సంపూర్ణ మద్దతు ప్రకటించిన పీఆర్‌టీయూ తెలంగాణ నేతలకు ఎమ్మెల్సీ కాటేపల్లి జనార్ధన్‌రెడ్డి ధన్యవాదాలు తెలిపారు.

# ఆహార భద్రత అధికారుల పరీక్ష ఫైనల్ కీ విడుదల

## 5 నుంచి టిఎస్‌పిఎస్‌సి వెబ్‌సైట్‌లో అభ్యర్థుల రెస్పాన్స్‌షీట్లు

**హైదరాబాద్, డిసెంబరు 2, ప్రభాతవార్త:** వైద్య, ఆరోగ్య శాఖలోని ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ పరీక్షకు సంబంధించిన ఫైనల్ కీని తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీఎస్‌పీఎస్‌సీ) ప్రకటించింది. ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్స్ నియామకం కోసం కమిషన్ నోటిఫికేషన్ నంబర్ 06-2022ను జారీ చేసిందని.. అందుకు సంబంధించిన పరీక్షను నవంబర్ 7న నిర్వహించినట్లు కమిషన్ కార్యదర్శి అనితా రామచంద్రన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షకు సంబంధించిన ప్రాథమిక కీని నవంబర్ 15న రిలీజ్ చేశారు. నవంబర్ 16 నుంచి 20 వరకు వచ్చిన అభ్యంతరాలను ఎక్స్‌పర్ట్ కమిటీ పరిశీలించి ఫైనల్ కీని కమిషన్ వెబ్‌సైట్‌లో పొందుపర్చనున్నారు. అభ్యర్థుల రెస్పాన్ షీట్స్‌ను ఫైనల్ కీకి అనుగుణంగా వెబ్‌సైట్‌లో ఈ నెల 5 నుంచి అభ్యర్థులకు అందుబాటులో ఉంచనున్నట్లు కమిషన్ కార్యదర్శి ఒక ప్రకటనలో తెలిపారు.

# కేంద్రం స్కాలర్‌షిప్ రద్దుపై విద్యార్థి సంఘాల ఆగ్రహం

- నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి: ఎస్ఎఫ్ఐ
- పేదలకు బీజేపీ విద్యను దూరం చేసే కుట్ర: ఎఐఎస్ఎఫ్

**హైదరాబాద్, డిసెంబరు 2, ప్రభాతవార్త:** 8వ తరగతి లోపు విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ను రద్దు చేయాలనే కేంద్రం నిర్ణయంపై విద్యార్థి సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఇప్పటి వరకు కొనసాగిన స్కాలర్‌షిప్‌ను రద్దు చేస్తే విద్యార్థులు ప్రాథమిక విద్యకు దూరమయ్యే ప్రమాదం ఉందని ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ విమర్శిస్తున్నాయి. స్కాలర్‌షిప్‌ల రద్దు నిర్ణయాన్ని బీజేపీ వెంటనే ఉపసంహరించుకోవాలని ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి, రాష్ట్ర కార్యదర్శి టి నాగరాజు డిమాండ్ చేశారు. విద్యార్థుల సాల్కర్‌షిప్‌ల రద్దు వల్ల పేద విద్యార్థులను బీజేపీ ప్రభుత్వం చదువులకు దూరం చేస్తుందని మండిపడ్డారు. తక్షణమే ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. పేద విద్యార్థులకు ఇస్తున్న స్కాలర్‌షిప్‌లు వారి చదువుకు ఎంతో కొంత ఉపశమనంగా ఉంటుందన్నారు. కానీ ప్రస్తుతం ఉచిత నిర్బంద విద్యను సాకుగా చూపి కేవలం 9, 10 తరగతుల విద్యార్థులకే ఈ స్కాలర్‌షిప్‌లను పరిమితం చేసే విధంగా కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నిందన్నారు. దీని వల్ల ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, ఈబీసీ విద్యార్థులు చదువులకు దూరమై డ్రాపౌట్స్ పెరిగే ప్రమాదం ఉందన్నారు. దేశం 100 శాతం అక్షరాస్యత సాధించాలని ఒకవైపు చెబుతూనే ఇలాంటి ప్రమాదకర నిబంధనలు తేవడంతో లక్ష్యం నెరవేరదన్నారు. తక్షణమే కేంద్రం ఈ నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని లేకపోతే విద్యార్థి సంఘాలతోపాటు.. ఇతర ప్రజాసంఘాలతో కలిసి ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం పేద విద్యార్థులకు విద్యను దూరం చేసే కుట్ర చేస్తోందని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ విమర్శించారు. కుట్రలో భాగంగానే 2022-23 ఆర్థిక సంవత్సరం 6వ తరగతి నుంచి 8వ తరగతి లోపు విద్యార్థులకు స్కాలర్‌షిప్ ఇవ్వబోమని కేంద్రం ప్రకటించిందన్నారు. దీని ద్వారా బీజేపీ ప్రభుత్వం విద్యార్థి వ్యతిరేక విధానాలను అవలంభిస్తుందని స్పష్టం అవుతుందన్నారు. స్కాలర్‌షిప్‌ల రద్దు నిర్ణయాన్ని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని లేనివక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని మణికంఠరెడ్డి, లక్ష్మణ్ హెచ్చరించారు.

# 8వ తరగతిలోపు విద్యార్థులకు కేంద్రం అన్యాయం చేయొద్దు

## రాష్ట్రబిసి కమిషన్ సభ్యుడు ఉపేంద్ర


**హైదరాబాద్, డిసెంబరు 2, ప్రభాతవార్త:** రానున్న ఆర్థిక సంవత్సరం నుంచి 8వ తరగతి లోపు చదువుతున్న ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, ఈబీసీ, పేద విద్యార్థులకు ఇచ్చే స్కాలర్‌షిప్‌లను రద్దు చేయనున్నట్టు కేంద్రం చేసిన ప్రకటనను వెంటనే విరమించుకోవాలని తెలంగాణ స్టేట్ బీసీ కమిషన్ సభ్యులు సీహెచ్ ఉపేంద్ర డిమాండ్ చేశారు. పేద విద్యార్థులకు ఇస్తున్న స్కాలర్‌షిప్‌లు వారి చదువుకు ఎంతో కొంత ప్రోత్సా హాకరంగా ఉంటుందన్నారు. 8వ తరగతిలోపు విద్యార్థులకు ఇస్తున్న స్కాలర్‌షిప్‌ను రద్దు చేయకుండా కొనసాగించాలని ఆయన కేంద్రానికి సూచన చేశారు. ఒకవేళ విద్యార్థులకు ఇచ్చే స్కాలర్‌షిప్ రద్దు చేస్తే పేద విద్యార్థులు ప్రాథమిక విద్యకు సైతం దూరం అవుతారని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ విధానాలు బీసీ వర్గాలకు ఎంబీసీ వర్గాలకు ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు వ్యతిరేకంగా ఉన్నాయన్నారు.

# మాదకద్రవ్యాల కట్టడికి సర్కారీ విభాగాలతో కొత్వాల్ భేటీ

**హైదరాబాద్, డిసెంబరు 2, ప్రభాతవార్త:** జంట నగరాలు, శివార్లలో మాదకద్రవ్యాలను పూర్తిగా కట్టడి చేసేందుకు అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించేందుకు సిటీ కొత్వాల్ ఆనంద్ శుక్రవారం నాడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విభాగాల ఉన్నతాధికారులతో భేటీ అయ్యారు. బంజారాహిల్స్ లోని కమాండ్ కంట్రోల్ లో జరిగిన ఈ భేటీ లో సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్ల ఉన్నతాధికారులతో పాటు ఎన్‌ఫోర్స్ మెంట్ డైరక్టరేట్, డిఆర్ఐ, నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో, జిఎస్‌టి, అబ్కారీ, ఎఫ్ఆర్ఆర్ఓ, డ్రగ్స్ కంట్రోల్, కౌంట ర్ ఇంటెలిజెన్స్ విభాగాల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆనంద్ మాట్లాడుతూ తెలంగాణలో మాదకద్రవ్యాలను పూర్తిగా నిరోధించా లని సర్కారు నిర్ణయిం చినందున పోలీసు శాఖ కఠినంగా వ్యవహరి స్తోందని అన్నారు.

ఈ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విభాగాల సహకారం కావాలని ఆయన కోరారు. ముఖ్యంగా విదేశాల నుంచి, దేశంలోని ఇతర నగరాల నుంచి వస్తున్న డ్రగ్స్ స్మగ్లర్లను పట్టుకునేందుకు స మాచార మార్పిడి మరింత చురుకుగా జరగాలని ఆ యన కోరారు. హైదరాబాద్‌లో మాదకద్రవ్యాల నిరోధ కానికి ప్రత్యేకంగా ఒక విభాగాన్ని ఏర్పాటు చేసిన విషయాన్ని ఆనంద్ ప్రస్తావించారు. గడచిన కొన్ని నెలలుగా ఈ విభాగం సాధించిన విజయాలను ఆయన ఉదహరించారు. ఇదే సమయంలో సైబరాబాద్, రా చకొండ పోలీసు విభాగాలు కూడా మంచి విజయాలు సాధించాయని ఆయన తెలిపారు.

మాదకద్రవ్యాల విషయంలో కఠినంగా వ్యవహరించకుంటే భవిష్యత్ తరాలు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం వుందని ఆయన తెలిపారు. రసాయన మాదకద్రవ్యాల తయారీలో వాడుతున్న కొన్నిరకాలల రసాయనాలను నిరోధించాల్సిన అవసరం వుందని ఆయన చెప్పారు. సిటీ కొత్వాల్ అభిప్రాయాలతో డిఆర్ఐ సహా ఇతర విభా గాల అధికారులు ఏకీభవించారు. మాదకద్రవ్యాల కట్టడికి తమ వంతు సహకారం అందిస్తామని వారు హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో రాచకొండ సి పి మహేష్ భగవత్, సిసిఎస్ జాయింట్ సిపి గజారావు భూపాల్ తదితరులు పాల్గొన్నారు.



మాదకద్రవ్యాల కట్టడికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విభాగాల అధికారులతో భేటీ అయిన సిటీ కొత్వాల్ ఆనంద్

hmda

హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ

4వ అంతస్తు, స్వర్ణజయంతి కమర్షియల్ కాంప్లెక్స్, అమీర్‌పేట, హైదరాబాద్.

HMDA చట్టం 2008 యొక్క విభాగం 15(4) క్రింద బహిరంగ ప్రకటన

(G.O.Ms.No. 160 MA & UD విభాగం, తేది: 05.09.2022)

హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ చట్టం 2008 (2008 యొక్క చట్టం నం.8) యొక్క సెక్షన్ 15 యొక్క సబ్ సెక్షన్ (1)ద్వారా సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ, ప్రభుత్వం ఇందుమూలముగా సదరు సెక్షన్ యొక్క సబ్ సెక్షన్ (1)కు అవసరమైన విధంగా G.O.Ms.No.33, MA & UD తేది:24.01.2013 ప్రకారం, ప్రకటించబడిన నోటిఫైడ్ మాస్టర్ ప్లాన్ (MDP)2031 లోని భూవినియోగానికి ప్రభుత్వం ఈ క్రింది విధంగా మార్పు చేస్తోంది. సర్వే నం.31P, 32P, 33P, 37P, 38, 39P, 40P, 42P మరియు 43P లలోని 279516.37 చ.మీ. విస్తీర్ణం గల ఆర్.ఆర్.జిల్లా, శంకర్‌పల్లి (మం) చండిప్ప (గ్రా) స్థలం ప్రస్తుతం కన్జర్వేషన్ వినియోగ జోన్‌గా G.O.Ms.No. 33 MA తేది: 24.01.2013 ప్రకారం నోటిఫైడ్ మాస్టర్‌ప్లాన్ (MDP) 2031 లో గుర్తించబడినది. ప్రస్తుతం నివాస వినియోగజోన్‌గా ఉద్దేశించబడినది. పై సంబంధిత వివరాలు వెబ్‌సైట్ http://gazette.telangana.gov.in// మరియు http://hmda.gov.in// వెబ్‌సైట్‌లలో అందుబాటులో ఉన్నవి.

DIPR No.9673-PP/CL/Advt/1/2022-23 తేది: 02.12.2022 సం/- మెట్రోపాలిటన్ కమిషనర్ తరపున, HMDA.

hmda

హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ

4వ అంతస్తు, స్వర్ణజయంతి కమర్షియల్ కాంప్లెక్స్, అమీర్‌పేట, హైదరాబాద్.

HMDA చట్టం 2008 యొక్క విభాగం 15(3) క్రింద బహిరంగ ప్రకటన

(ప్రభుత్వ మెమో.నం. 13013/Plg.I(1)/2022, తేది: 29.10.2022)

HMDA చట్టం 2008 (2008 యొక్క చట్టం నం.8) యొక్క సెక్షన్ 15 యొక్క సబ్ సెక్షన్ (1)కి దఖలు పరచబడిన అధికారాలను వినియోగిస్తూ ప్రభుత్వం ఇందుమూలముగా సదరు సబ్ సెక్షన్ (1)కు అవసరమైన విధంగా G.O.Ms.No.288 MA తేది: 03.04.2008 ప్రకారం ప్రకటించబడిన నోటిఫైడ్ మాస్టర్ ప్లాన్-2021లోని భూ వినియోగానికి ఈ క్రింది విధంగా మసాయిదా మార్పు ప్రతిపాదిస్తోంది. G.O.Ms.No.288 MA తేది: 03.04.2008 ప్రకారం నోటిఫైడ్ మాస్టర్ ప్లాన్ 2021లో పెరి-అర్బన్ వినియోగానికి ప్రస్తుతం గుర్తించబడిన 92,464.95 చ.మీ. (22.85 ఎకరాలు) విస్తీర్ణం రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బండరావిరాల గ్రామం యొక్క సర్వే నం/Pt.Nos 293/3 యొక్క భాగంలోని ఆ స్థలం ప్రస్తుతం G.O.Ms.No.106 MA తేది: 06.07.2020 యొక్క వర్తింపు సంబంధితంగా నివాస వినియోగానికి గుర్తింపుతో ఉద్దేశించబడినది. పై సంబంధిత వివరాలు వెబ్‌సైట్‌లో http:// gazette.telangana.gov.in// మరియు http://hmda.gov.in// వెబ్‌సైట్‌లలో అందుబాటులో ఉన్నవి. ఏ వ్యక్తి లేదా సంస్థ నుండి సదరు ప్రతిపాదనకు సంబంధించి అభ్యంతరాలు/సూచనలు పరిగణించబడతాయి. వారు వారి అభ్యంతరాలు/సూచనలను లిఖిత పూర్వకంగా MC, HMDAకు లేదా హైదరాబాద్ తెలంగాణ సెక్రటేరియట్ MA & UD విభాగం స్పెషల్ చీఫ్ సెక్రటరీ గార్కి ఈ ప్రకటన ప్రచురించబడిన తేదీ నుండి పదిహేను (15) రోజులలోగా దాఖలు చేయవలెను.

DIPR No.9676-PP/CL/Advt/1/2022-23 తేది: 02.12.2022 సం/- మెట్రోపాలిటన్ కమిషనర్ తరపున, HMDA.

